క్లుప్తంగా

గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు



అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి నాలుగు అర్జీలు అందినట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

సామర్లకోట: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 8 గంటలకు జి.మేడపాడులోని వైఎస్సార్ విగ్రహం వద్ద, 8.30లకు వేట్లపాలెంలో, 9.15కు పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో, 9.45కు సామర్లకోట జగనన్న కాలనీలో, 10.30కు ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జయంతి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలన్నారు.

రేపు మండల స్థాయి అధికారులకు శిక్షణ

సామర్లకోట: రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండల స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ ఉంటుందని డిప్యూటీ ఎంపీడీఓ భైరవమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, మండల వ్యవసాయాధికారి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, మండల వైద్యాధికారి, ఎంఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, మండల గణాంకాధికారి, మండల సర్వేయర్, వెలుగు ఏపీఎం, ఉపాధి హామీ ఏపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

ఉపవాస ప్రార్థన కూడికల వాయిదా

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ప్రపంచ శాంతికి ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనా కూడికల్లో భాగంగా ఈ నెల 10, 11వ తేదీల్లో జరగాల్సిన కార్యక్రమం వాయిదా వేసినట్లు క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. సోమవారం దివిలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పిఠాపురం మండలం విరవ చర్చిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించే ఉపవాస ఉజ్జీవ వేడుకలను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు చెప్పారు. ఇదే నెల 17, 18 తేదీల్లో ప్రార్థనా కూడికలు ఉంటాయని తెలిపారు.

సర్కారీ స్కూళ్లలో అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీ షరీఫ్

సామర్లకోట: స్పెషల్ డ్రైవ్‌లో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా కృషి చేయాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్ అన్నారు. అప్పుడే ఉపాధ్యాయులు చేస్తున్న స్పెషల్ డ్రైవ్‌కు గుర్తింపు ఉంటుందని చెప్పారు. సోమవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆరు, ఎనిమిది తరగతుల్లో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. పాఠశాలలో అమలు జరుగుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. భోజనం తింటున్న విద్యార్థుల శాతాన్ని తెలుసుకున్నారు. ఇంటి వద్ద తయారు చేసే భోజనం కంటే, మధ్యాహ్న భోజనం పథకం వంటకాలు రుచిగా ఉంటే.. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలలోనే భోజనం చేస్తారన్నారు. ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, బ్యాగ్, షూ పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఉన్నారు.

ఎమర్జెన్సీని మించిన పరిస్థితి

- స్థానిక సంస్థల ప్రతినిధుల హక్కులను కాలరాస్తున్నారు
- కూటమి నేతల తీరును దుయ్యబట్టిన నాయకులు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న వంగా గీత. చిత్రంలో పార్టీ ప్రముఖులు



సమావేశానికి తరలివస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పిఠాపురం: ప్రభుత్వం మారితే ప్రజలతో ఎన్నుకోబడిన ప్రతినిధుల హక్కులు మారిపోతాయా, ఇక మాతో పనిలేదా, మా హక్కులను కాలరాసే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారు అంటూ పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. సోమవారం గొల్లప్రోలులో వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో కూటమి ప్రభుత్వ తీరును ప్రజాప్రతినిధులు దుయ్యబట్టారు. సమావేశంలో పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, పిఠాపురంలో ఎమర్జెన్సీని మించిన రాజ్యాంగం నడుస్తోంది. మా ఎమ్మెల్యే అందుబాటులో ఉండరు, ఆయన ఎక్కడ ఉంటారో మాకు తెలియదు.. అని ఎద్దేవా చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నీతికి, నిజాయతీకి నిలబడి, పార్టీకే కట్టుబడి ఉన్నారన్నారు.

అడ్డుకోవడం దారుణం

స్థానిక సంస్థల ప్రతినిధుల్ని ప్రభుత్వం పట్టించుకోకుండా, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక రాజ్యాంగంగా నడుపుతున్నారని వారన్నారు. మున్సిపాలిటీలో దళితులను, దళితవాడల అభివృద్ధిని ప్రభుత్వం కక్ష కట్టి అడ్డుకుంటుందన్నారు. స్థానిక సంస్థల నిధులతో ఆమోదించిన పనుల్ని ప్రభుత్వం అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం మున్సిపాలిటీకి రూ.3 కోట్లు, గొల్లప్రోలు నగర పంచాయతీకి రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో పవన్ కల్యాణ్ ఇచ్చిన నిధులకు సంబంధించి ప్రస్తుతం అధికారంలో ఉన్న పాలకవర్గాన్ని పక్కనబెట్టి.. జనసేన నేతలు పనులు ప్రతిపాదించారన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన స్థానిక సంస్థల ప్రతినిధుల్ని కనీసం పట్టించుకోకుండా అధికారులు ఏకపక్షంగా ప్రతిపాదనని తీసుకొస్తున్నారని విమర్శించారు. తమ పార్టీలోకి వస్తే, అన్ని పనులూ చేయిస్తామని, అన్ని విధాలా సహకరిస్తామని కూటమి నేతలు తమను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అయినా తాము వెళ్లేందుకు ఒప్పుకోలేదని, పార్టీకి కట్టుబడి ఉన్నామని, ఇక ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడుతున్నామన్నారు. దీంతో తమపై వేధింపులకు తిరుగుతున్నారని, అనేక కక్షసాధింపు చర్యలకు దిగారని, అయినప్పటికీ తాము ధైర్యంగా ఎదుర్కొంటున్నామన్నారు. దళితులపై కూటమి ప్రభుత్వానికి, జనసేనకు తీవ్ర నిర్లక్ష్యం ఉందని, అది ఇక్కడ కనిపిస్తోందని ఆరోపించారు.

సిద్ధంగా ఉన్నాం

రాబోయే రోజుల్లో తీవ్ర ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని, నాయకులంతా తమకు సహకరించాలని స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో నిధులు చేతులు మారాయని, నిజాలు బయటపడతాయన్న భయంతో కేబుల్ నెట్‌వర్క్‌లో సాక్షి టీవీ రాకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, గొల్లప్రోలు జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు. వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్య, ఆనాల సుదర్శన్, రావుల మాధవరావు, అడపా రఘు, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, గండేపల్లి బాబి, మొగలి అయ్యారావు, రావు చిన్నారావు, జ్యోతుల భీముడు, కడిమిశెట్టి భాస్కర్‌రెడ్డి, పచ్చిమళ్ల జ్యోతి, అనిశెట్టి సుబ్బారావు, కొప్పున శివనాథ్, మాదిరెడ్డి దొరబాబు, ఉలవల భూషణం, అల్లవరపు మల్లిక, జవ్వాది కృష్ణ మాధవరావు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, కారే శ్రీనివాసరావు, పెదపాటి రాజేష్, కొత్తం దత్తుడు, అరిగెల రామయ్యదొర, దాసం వెంకటేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి జనం భారీగా తరలివచ్చారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన సుమారు రెండు వేల మంది నాయకులు, కార్యకర్తలు సమావేశానికి ర్యాలీలుగా తరలివచ్చారు. ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇంత జనం తరలిరావడాన్ని చూసిన ప్రజలు.. ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఉందా అంటూ చర్చించుకున్నారు.



సమావేశానికి తరలి వస్తున్న కొత్తపల్లి మండలానికి చెందిన మత్స్యకార నాయకులు

సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

కమిషనర్‌కు నోటీసు అందజేత



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

పెద్దాపురం: సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈ నెల 9న జరిగే ఆందోళనలో మున్సిపల్ కార్మికులు పాల్గొననున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ తెలిపింది. దీనిలో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శివకోటి అప్పారావు మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లను రద్దు చేయనందుకు చేపట్టిన ఈ సమ్మెకు మున్సిపల్ వర్కర్లు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమ్మెలో కార్మిక వర్గాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వగ్రే గిరిబాబు, ఏడిద చిన్ని, దొండపాటి శేఖర్, మహేష్, సీఐటీయూ మండల కార్యదర్శి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా మోటార్ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి సోమవారం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు బేబీరాణి, జె.వెంకటేశ్వర్లు, తోకల ప్రసాద్, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమలన్నింటిలో 75 శాతం ఉపాధిని స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలను పెంచుతూ చేసిన తీర్మానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలకు కార్మికవర్గం సిద్ధపడాలని పిలుపునిచ్చారు. పది శాతంగా ఉన్న పెట్టుబడిదారుల వద్ద దేశం మొత్తం సంపదలో 57 శాతం కేంద్రీకృతమై ఉందన్నారు. మిగిలిన 43 శాతం సంపద మాత్రమే 90 శాతం ప్రజలదని, ప్రపంచంలో 50వ పేద దేశంగా భారత్ నిలిచేందుకు బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని ఆరోపించారు. పేద, ధనిక అంతరాల్లో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండగా, ప్రపంచ ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని చెప్పుకోవడానికి ప్రధాని మోదీ ఏ మాత్రం సిగ్గు పడటం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే 4 లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇవి అమల్లోకి వస్తే కార్మిక వర్గం 200 ఏళ్ల వెనుకటి పరిస్థితులకు నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని 45 కోట్ల మంది కార్మిక వర్గం సమ్మె చేయడానికి సిద్ధపడిందన్నారు. కాకినాడ జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు, మేధావులు ప్రజాస్వామిక వాదులందరూ సమ్మె పోరాటాల్లో పాల్గొని, మోదీ–కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, పద్మావతి, భారతీప్రియ, జ్యోతి, అప్పలస్వామి, వర్మ, రామకృష్ణ, కుమారస్వామి, చిట్టిబాబు, అనపర్తి ఏడుకొండలు, శ్రీకాంత్, నరసరాజు, బి.రవి, కమలాకర్, కరీముల్లా, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా ఏజెంట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేయడానికి అర్హత ఉన్న యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా కాకినాడ పోస్టల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నేటి నుంచి గురు పూర్ణిమ ఉత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో సామర్లకోట షిర్డీ సాయిబాబా మందిరం

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో దత్తాత్రేయ సమేతంగా వేంచేసిన షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆంధ్ర సాయి గీతా సమాజం ఆధ్వర్యంలో గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి, విద్యుద్దీపాలంకరణ చేశారు. సాయిబాబా మందిర కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి జి.సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ, ప్రతి రోజు ఉదయం బాబావారికి మేలు కొలుపు హారతి, అభిషేకాలు, పూజలు ఉంటాయన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆలయం వద్ద బాలికలతో పాటలు, కోలాట ప్రదర్శన, సాయంత్రం 4 గంటలకు మందిరం నుంచి పట్టణ వీధుల్లో పల్లకీ, వాహన ఉత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. గురుపూర్ణిమ రోజున తెల్లవారుజామున మేలుకొలుపు హారతి, బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు చేస్తారన్నారు. అనంతరం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు స్థానిక రైల్వే కల్యాణ మండపంలో భారీఎత్తున అన్న సమారాధన ఉంటుందని చెప్పారు. అలాగే పిఠాపురం రోడ్డులోని సాయిబాబా మందిరంలోను, కోట్లమ్మ చెరువు వద్ద సాయిబాబా మందిరంలోను గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

రైతు భరోసా కేంద్రం స్వాధీనం


సాక్షి ఇంపాక్ట్



పీబీ దేవంలో స్వాధీనం చేసుకున్న రైతు భరోసా కేంద్రం

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఈ రైతు భరోసా కేంద్రం అసంపూర్తిగా ఉండటంతో ఇటీవల గ్రామానికి చెందిన నాయకులు బీహార్ నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలకు విడిదిగా ఇచ్చారు. దాంతో గత నెల 28న సాక్షిలో «సేవ ఇదేనా?» శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ క్రమంలో ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు రైతు భరోసా కేంద్రానికి రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టరు స్పందించి వెంటనే రైతు భరోసా కేంద్రంలో ఉంటున్న కూలీలను ఖాళీ చేయించి, భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యవసాయాధికారులు ఆదివారం వ్యవసాయ కూలీలను ఖాళీ చేయించారు. ఈ రైతు భరోసా కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. వైరింగ్ పనులు, స్విచ్ బోర్డులు, లైట్లు ఏర్పాటు చేశారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి



గొంచాలలో శివలింగానికి చేస్తున్న క్షీరాభిషేకం

సామర్లకోట: ఆషాఢ మాసం, ద్వాదశి కావడంతో స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు, ఉపాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భక్తులు వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి భక్తులు పాలు, పుష్కరిణిలోని నీటితో అభిషేకాలు చేశారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్థానిక మఠం సెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, గొంచాల, పీబీ దేవం శివాలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



అమీనాబాద్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అమీనాబాద్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, సంఘ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు మోర్త రవి, జిల్లా కోశాధికారి సిద్ధాంతం బెన్‌జాన్సన్, ముమిడివరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై బాలికలకు అవగాహన అవసరం

బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ దుర్గారాణి



బాలికల హక్కులను వివరిస్తున్న దుర్గారాణి

పిఠాపురం: బాలికలకు తమ హక్కులపై కచ్చితమైన అవగాహన ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. సోమవారం స్థానిక బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమానికి పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్‌కే దుర్గాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ, బాలికలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కులు ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులు, మంచి స్పర్శ–చెడు స్పర్శ, బాలల సంబంధిత చట్టాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో బాలల హెల్ప్‌లైన్ నంబరు 1098కి కాల్ చేయాలని సూచించారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే, బాల్య వివాహ నిర్మూలన చట్టం ప్రకారం రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గండం..!

- ప్రాణాపాయంగా మారిన పశువులు
- రాత్రి పూట యథేచ్ఛగా రోడ్లపైనే తిష్ట
- పోలీసుల హెచ్చరికలను పట్టించుకోని యజమానులు
- ఇటీవల గేదెను బైక్ ఢీకొని యువకుడి మృతి



కాకినాడలో రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

కాకినాడ రూరల్: బతుకు తెరువు కోసం వివిధ ప్రాంతాల నుంచి కాకినాడ వచ్చే వారితో పాటు, నగరవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు తమ పనులు ముగించుకుని రాత్రిపూట ఆలస్యంగా ఇళ్లకు పయనమవుతారు. వారికి కాకినాడ నగరంలో రోడ్లపై పశువులు ప్రాణసంకటంగా మారుతున్నాయి. అడ్డదిడ్డంగా తిరుగుతూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. రోడ్ల మధ్యలో నిద్రించే పశువులను దూరం నుంచి గమనించేలోపే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి, క్షతగాత్రులుగా మారుతున్నారు. కాకినాడ నగరంలో గుడారిగుంట ఎస్‌బీఐ బ్రాంచ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన అతడు రోడ్డుపై అడ్డంగా ఉన్న గేదెను నేరుగా ఢీకొని, తీవ్రంగా గాయపడి చనిపోయాడు. చాలా మంది గాయాల పాలై ఆస్పత్రిలో చేరుతున్నా.. రోడ్లపై సంచరించే పశువులను మాత్రం ఎవరూ కట్టడి చేయలేకపోతున్నారు.

కాకినాడ నగరంతో పాటు, సమీపంలోని ఇంద్రపాలెం, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, తూరంగి తదితర గ్రామాలలో పశువులు రోడ్లపై ఎక్కువగా సంచరిస్తున్నాయి. పగటి పూట ఖాళీ ప్రదేశాలలో దర్శనమిచ్చే పశువులు చీకటి పడితే రోడ్లపై చేరుకుంటున్నాయి, రోడ్లపై అడ్డదిడ్డంగా తిరుగుతూ అక్కడే పడుకుంటున్నాయి. కొన్నిచోట్ల గుంపులుగా రోడ్లపై ఉండడంతో, వాటిని తప్పించుకుని వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ నగరం, పరిసర రూరల్ గ్రామాల్లో రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు వేగంగా తమ బైక్‌లపై వెళుతూ, పశువులను గమనించడం లేదు.

పట్టించుకోని యజమానులు

యజమానులు పశువులను పాడినిచ్చే సంపదగానే కొలుస్తున్నారు, రోడ్లపై విడిచిపెట్టడం వలన వాటికి ప్రాణాపాయం ఉందని గమనించడం లేదు. ఇటీవల డెయిరీ ఫారమ్ సెంటరు వద్ద వాహనాలు ఢీకొన్న ఘటనలో రెండు ఆవులు కూడా చనిపోయాయి. పశువులతో పాటు, ప్రజలకూ ప్రాణహాని జరగకుండా ఉండాలంటే వాటిని రోడ్లపై విడిచిపెట్టరాదని పలువురు చెబుతున్నారు. తద్వారా వాహనదారులు ప్రాణాలు కాపాడిన వారవుతారంటున్నారు. అలాగే పశువులకు కూడా రక్షణ కల్పించినట్టు అవుతుందని చెబుతున్నారు. పశువుల యజమానులకు అవగాహన కల్పించడం ద్వారానే రోడ్లపై పశు సంచారాన్ని నియంత్రించడం సాధ్యమవుతుందని నగరవాసులు చెబుతున్నారు. ఇంద్రపాలెం పోలీసులు ఇటీవల రోడ్లపై సంచరించే పశువుల యజమానులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. అదేవిధంగా అన్ని స్టేషన్ల పరిధిలో చేపట్టి, వాటి సంచారాన్ని నిర్మూలించగలిగితే ప్రమాదాలకు చెక్ పెట్టినట్టు అవుతుంది.



కాకినాడ–రామేశ్వరం ప్రధాన రహదారిపై ఇంద్రపాలెం వద్ద రాత్రి పూట పశువుల తిష్ట

ఐఐఎఫ్‌టీ ఎంబీఏ బ్యాచ్ ప్రారంభం



ఐఐఎఫ్‌టీ ఎంబీఏ నూతన బ్యాచ్ విద్యార్థులు

బాలాజీచెరువు: ఐఐఎఫ్‌టీ ఎంబీఏ విద్యార్థుల 2025–27 నూతన బ్యాచ్‌ను సోమవారం జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఉన్న ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌లో ప్రారంభించారు. క్యాంపస్ విభాగాధిపతి డాక్టర్ వి.రవీంద్రసారథి విద్యార్థులకు స్వాగతం పలకగా, ప్రొఫెసర్ మిథిలేష్ ప్రసాద్ యాదవ్, డాక్టర్ సౌరవ్‌దాష్, జేకే వర్మ, డాక్టర్ ఓలీమిత్రా విద్యార్థులకు కోర్సుపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచ వాణిజ్యం, అంతర్జాతీయ వ్యాపార భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వారిని తయారు చేయడానికి రూపొందించబడిన మంచి కోర్సు అని, వాణిజ్య, లాజిస్టిక్స్, ఫైనాన్స్ మార్కెటింగ్‌లో కూడిన సూత్రాలను మిళితం చేయబడిందని ప్రొఫెసర్లు విశదీకరించారు. విద్యార్థులకు నాలుగు రోజుల పాటు వృత్తిపరమైన వాతావరణంలో పరిచయం చేయడానికి ఒరియంటేషన్ నిర్వహిస్తామని విభాగాధిపతి రవీంద్రసారథి తెలిపారు.